టప్పటికి అందరూ "అమ్మోరు కాదు! కాద" న్నారు—"అందుకే పలుకుమారింది" అన్నారు. "అద్దద్దద్ద-భ - అమ్మోరు అయితేను పింఛాను కెళ్ళింది. కోరింది మీరైతే చేస్తేనే చేశారు. లేకుంటే అందర్ని లేకుండా చేస్తాను అద్దద్దద్ద-భ-హింసాను చేసేటి శక్తిని కాని గ్రోయ్-అహింసా మార్గంతో అందర్ని రక్షిస్తా. రేపైతే మీరంతా సర్కారు మనుష్యుల్తో - టీకాలు సూదులూ వేయించితీరాలి. లేకుంటే అందర్ని మింగేస్తా, నలిపేస్తా, వూడుస్తా అద్దద్దద్ద-భ భ-భ" అంటూ సూరయ్య క్రింద వొరగబోయే టప్పటికి అందరూ వచ్చి క్రింద పరుండ బెట్టారు. ఇంకేముంది! అందరి నోళ్లల్లో కర్రలు దించినట్టయింది. అంతా నిశ్శబ్దం. ఇదంతా చూస్తున్న నడిపోడు "అయ్యోయ్! మన కోడిని వదలిపెడతరంటనే" అంటూ స్పృహ తప్పివున్న వీరాసామితో అన్నాడు.

"ఆ! ఆ! మన కోడినా! వదిలిపెడితారా" అంటూ లేచి జనంవంక చూస్తూ "దీనికంతా కారణం కోడికాదని అమ్మోరికి మాత్రం తెలియదంటూరా? అందుకే ఆహారం వద్దన్నది. కోడికి కులమట కులం, వన్నెట వన్నె! మీ పిల్లలందరికీ మీ రూపు రేఖలే వున్నాయా? మీరంతా మీ అయ్యలల్లే వున్నారా? తిథి, నక్షత్రం సరిగా లేదని మీ పిల్లలను పిసికేస్తున్నారా? మాట్లాడరేం? కోడి కూడా అంతే. మీరంతా పెత్తందార్ల, సెంటు భూమి లేకనే సెభాష్‌గా బ్రతుకుతున్న సోమరిపోతుల మాటలకు మోసపోయారు. అందుకే ఇంత అఘాయిత్యానికి పాలుపడ్డారు" అంటూ పండ్లు పట పట కొరికేటప్పటికి పెత్తందార్లంతా పరారయ్యారు. అందరూ చేసినపనికి పశ్చాత్తాప పడి నిముషం నిశ్శబ్దంగావుండి అందరూ వీరయ్య వద్దకు వచ్చి "అరే, వీరయ్యా వాళ్ళమాటలు నమ్మి మోసపొయ్యాంరా! తెలిసో, తెలియకనో చేసాం. వాళ్ళపని పడుదాం, ఏం అనుకోబాక" అని అన్నారు. అంతలో నాగమ్మ పిల్లల్తోవచ్చి వీ రా సా మి సరసనే వాలింది. తెల్లవారుతూంది. అప్పుడే కులంవచ్చిన కోడి రయ్యిన నవరంగుల రెక్కలు రెపరెపలాడిస్తూ అమ్మోరుగుడి ఎక్కింది. కొత్తరకం కూత కూసింది. ఆ రోజు కు, అదే తొలికూత. కూత వింటంతోటే వూర్లో కోళ్ళ కవులన్ని కరగి కలవరించాయి. వీరాసామి తన కర్రని కోరమీసం దువ్వుతూ "నాది వీరకులం కోడిరా" అన్నాడు, నడిపోడు సహితం తొడ చరుస్తూ "నాది ఈరకోడిరా" అన్నాడు. అంతలో సూరయ్యవచ్చి వీరాసామి చెవులో ఏదో చెప్పాడు. అది పక్కనేవున్న నాగమ్మా, పిల్లలూ విన్నారు. అందరూ ఆశ్చర్యపోయారు.

క థా ని క

# సుఖపడ్డ జీవుడు

"విశ్వామిత్ర"

"రామారావు చనిపోయాడు. ఆత్మహత్య" పొద్దున్నే ఈ మాటలు విన్న సుగుణ ఒక్కసారి కెవ్వున కేకేసింది.

రామారావు చనిపోయినందుకు ఆమెకేమీ దిగులులేదు. కాని అతను ఆత్మహత్య చేసుకోవటం ఆమెతో అతనికున్న సంబంధాన్ని జ్ఞాపకం చేసింది.

తనకు రామారావుతో వున్న రెండేళ్ళ పరిచయంలోనూ అతనెప్పుడూ ఆత్మహత్య చేసుకొంటానని సూచన ప్రాయంగానైనా అనక పోగా తన దగ్గిర వున్నంత సేపూ నిజంగా మృత్యువు వొచ్చి మీదపడ్డా ఎదుర్కొనేట్టు మాట్లాడేవాడు.

ఆమెకి తెలిసినంతవరకూ అతనికి ఆత్మహత్య చేసుకోవాలిసినంత అవసరం ఏమిటో బోధపడ్లేదు.

నిజంగా అతను సుగుణ కోసమే ఆత్మహత్య చేసుకొనివుంటే ఇప్పుడు ఆమె చెయ్యవలసిన పనేమిటి?

ఈ వార్త వినగానే సుగుణ రామారావు గదికి వెళ్ళింది. రామారావు శవం పక్కనవున్న సైనైడు బాటిల్ ఆత్మహత్యని రుజువుచేస్తోంది.

ఉత్తరమేదైనా రాసి తల కిందో, కాళ్ళ కిందో పెట్టుకొన్నాడేమోనని గదంతా గాలించారు స్నేహితులు. కాని ఏమీ దొరక్కపోవటం వల్ల అతను ఎవ్వరికీ ఏమీ చెప్పవలసింది వుండి వుండదని అంతా తేల్చుకొన్నారు.

కాని అతని ప్రతి నోటు పుస్తకంలోనూ వున్న "సుగుణ" పేరు అతనికి ఆమెమీది ప్రేమని వెల్లడిస్తున్నయ్.

సుగుణ చాలా విచారించింది. ఆఖరికి తనతోనైనా చెప్పకుండా ఈ ఘోరానికి ఎందుకు పూనుకొన్నాడా? అని విచారించింది.

స్నేహితులంతా ఓదార్చారు సుగుణని.

"తెలియచేస్తే మీరు మాత్రం వూరుకొంటారా అని తెలియచేసి వుండడు" అని అంతా అన్నారు.

"నిజమే! తనకి తెలియనిస్తే అతని ప్రాణానికి తను అడ్డుపడేది!" సుగుణ మనసులో అనుకొంది. ఓపికున్నంతసేపు గట్టిగా ఏడ్చి తర్వాత మౌనంగా కూర్చుని అతనితో తన పరిచయాన్ని నెమరేసుకొంటోంది సుగుణ.

రామారావు చాలా మంచివాడు! ప్రత్యేకంగా తన విషయంలో.

ఆమెతో కాలాన్ని ఎంతో సరదాగా గడిపేవాడు. ఆమెలేకుండా అతను సినిమాలకి వెళ్ళేవాడు కాదు. ఆమెకోసం రోజూ ఆమె రూముకి వెళ్ళేవాడు.

అతనికి ఆమెమీది ప్రేమని స్పష్టం చెయ్యటానికి చాలా సంఘటనలున్నయ్.

అతని ఆత్మహత్యకి కారణం తనే ఐనట్టు ఓ విషయం జ్ఞాపకం వొచ్చింది.

కొన్ని రోజులక్రితం సుగుణ వాళ్ళనాన్నా ఇంకా కొందరూ వచ్చి, సుగుణని చూసి పోయారు.

సుగుణ వాళ్ళనాన్నకీ రామారావుకీ వున్న పరిచయంవల్ల ఆమెతండ్రి సుగుణ పెళ్ళివిషయం అంతా అతనితో చెప్పాడు.

ఈ విషయం సూచనగా రామారావు సుగుణతో కొన్నిరోజుల కిందట అన్నాడు. కానీ ఆ విషయం అంత సీరియస్‌గా రామారావూ తీసుకోలేదు. సుగుణా తీసుకోలేదు.

ఇంతకంటే రామారావు ఆత్మహత్య చేసుకోవటానికి ఇంకో గట్టి కారణమేదీ కనిపించలేదు సుగుణకి.

తనకోసం చచ్చిపోయిన రామారావుని మనసులో పెట్టుకొని సుగుణ యెలా పెళ్ళి చేసుకోగలదు?

సుగుణ మనసులో ప్రతిజ్ఞ చేసుకొంది, ఇక తను యావజ్జీవితమూ బ్రహ్మచర్యాన్ని గడపాలని. అంతకంటే ఇంకోవిధంగా అతనిని ఎలా జ్ఞాపకం పెట్టుకోవాలో ఆమెకు అర్థం కాలేదు.

రామారావు తన భవిష్యత్తునిగురించి ఆలోచించి వుంటాడని సుగుణ ఊహించింది.

అతనలా ఊహించి, ముందు ముందు ఆమెకి జరగబోయే వివాహంవల్ల ఆమెకి కలగగల అతని వియోగమువల్ల ఆమె భరించలేక పడేబాధలు రామారావు కళ్ళెదట కనపడి వుంటయ్ అనికూడా సుగుణ వూహించింది. ఇప్పుడు రామారావు చనిపోవటం వల్ల ఆమె వివాహానికి అభ్యంతరం ఉండబోదని ఊహించి వుంటాడని ఆమె వూహించింది.

రామారావుని చూస్తే జాలేసింది సుగుణకి. తన భవిష్యత్తుకోసం అతని ప్రాణాల్ని బలి చేశాడు. ప్రేమజీవి! అనుకొంది సుగుణ. అతని పవిత్రప్రేమకి అంతకంటే ఇంకేం కావాలి తార్కాణం!

రామారావు కేవలం ఆమెకోసమే బతికాడు. ఆమెకోసమే మరణించేడు. ఇదే విషయం ఆమె మనసులో నాటుకుపోయింది.

అతనిబాకీ తీర్చటానికి ఆమె కేవలం బ్రహ్మచర్యాన్ని అవలంబించి నంతమాత్రాన తీర్చుకోలేదనీ, అసలు రామారావు బాకీని తను ఈ జన్మలో కాదుగదా, ఇంకా ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోగలనా? అని తనలో ప్రశ్నించుకొంది.

జరగాల్సిన కార్యక్రమాన్నంతా జరిపించి విచారంగా సుగుణ తన గది చేరుకొంది.

'ఆమె మనసులో ఒకటే ఆలోచన. అది రామారావు తనయందు చూపిన త
నిస్స్వార్థం! ప్రేమ!

నిజంగా తనకోసం ప్రాణాల్ని వొదలగల

జీవి ఇంకొకరు తన కెవరున్నారు? ఐనప్పుడు రామారావు కంటే తన కింకెవరు గొప్ప?! సుగుణకి కూడా ఇప్పుడు ఆత్మహత్య చేసుకోవటానికి అభ్యంతరమేమీ లేకపోయినప్పటికీ తను రామారావుకోసం చనిపోయినట్టు అవదు. రామారావు చనిపోవటంలో అర్థముంది. అది సుగుణ భవిష్యత్తు!

ఐనా తను రామారావుకోసం చనిపోయినట్టు రామారావుకి తెలియకపోయిం తర్వాత ఇంకెవరికి, ఎంతమందికి తెలిస్తే మాత్రమేం? తెలియక పోతేనేం? వీళ్లందరి కోసం తను చావటం లేదుగా!

పోస్ట్‌మన్ కవరేదో కిటికీలోంచి విసిరేశాడు. వాళ్ల నాన్న రాశాడు.

ఆ ఉత్తరం పూర్తిసారమిది. మొన్న వొచ్చినాయనికి సుగుణ నచ్చింది. సుగుణ తండ్రి కూడా పెళ్ళికొడుకు నచ్చాడు. ఆమెని ఒప్పుకోమని బలవంత పెట్టకపోయినా ఒప్పుకొంటే బావుంటుందని సలహా. ఇష్టమైతే ఏ ముహూర్తానికి నిశ్చయించాలో వెంటనే తెలియజేయమని.

ఆ ఉత్తరం చదువుతూంటేనే ఆమె రామారావుకేదో అపచారం చేస్తున్నట్టూ, తన వివాహానికి రామారావుని యజ్ఞపశువుగా బలి ఇస్తున్నట్టూ బాధపడింది.

తండ్రికి వెంటనే ఉత్తరం రాసింది. అందులో కొన్ని మాటలు—

“...రామారావు ఒక గొప్ప వ్యక్తి. నా సౌఖ్యంకోసం, నా ఉజ్జ్వల భవిష్యత్తుని చెరపకుండా ఉండటంకోసం తన ప్రాణాన్ని ధార పోశాడు. నాకు జరగగలదని అనుకొంటున్న వివాహానికి తను అడ్డం కాకుండా వుండాలని కళ్లు మూసుకున్నాడు. ఒక్కమాటలో, రామారావు నాకోసం బతికాడు. నాకోసం మరణించాడు. అతనిని విస్మరించి నేను వివాహం చేసుకుంటా ననుకోవటం వొట్టి భ్రమ.”— సుగుణ.

అది పోస్టు చేసిన మర్నాడు సుగుణకి ఇంకో ఉత్తరం వొచ్చింది. దాని వైపు అదో విధంగా చూసింది సుగుణ. వాళ్ళ నాన్నో, అమ్మో, లేకపోతే ఏ స్నేహితులో రాసుంటారు. అమ్మా నాన్నా రాస్తే తన పెళ్లి విషయం రాస్తారు. స్నేహితు లెవరైనా రాస్తే వాళ్ళవాళ్ళ గొడవలూ.

అంతేగానీ తన రామారావుని గురించిగానీ, అతని దగ్గిర్నుంచిగానీ కాదుగా!

ఉత్తరంమీద అడ్రసు అతి పరిచయమైన దస్తూరీతో వుంది. కవరు చింపింది.

ఆశ్చర్యం! అది రామారావు దగ్గిర్నుంచే. వుత్తరం పోస్టుచేసిన మర్నాడు పొద్దున మరణించాడన్నమాట రామారావు!

“...నేను చనిపోవటంవల్ల నీకు చాలా కష్టం కలుగుతుందని నాకు తెలుసు. కానీ నేను బతికుంటే, ముందు ముందు నువ్వనుభవించబోయే సౌఖ్యాన్ని చూసి సహించలేనేమోనని భయంతో నేను చావటానికి ఇష్టపడక తప్పలేదు.

నిజం చెప్పాలంటే నేను నీకోసమనే పేరుతో నాకోసం నేను మరణిస్తున్నాను. నువ్వు బాధ పడతావని నాకు తెలిసినా నాకీ బాధ తప్పిపోతుంది గదా ప్రస్తుతం, అని నా ఆశ. నిన్ను ఇంకో విషయంలో కూడా క్షమాపణ కోరుకొంటున్నాను. అది, నిన్ను ఇంత కాలం నుంచీ నా స్వార్థం కోసం వాడుకొన్నానని తెలియచేయటం!

నిన్ను సినిమాలకి తీసుకెళ్ళినా, నీకు ఎన్నో బహుమతులు కొనిపెట్టినా, అది నా ఆనందం కోసమే! ఐతే ఆ స్వార్థం, ముందు నిన్ను ఆనందపరచటంవల్ల నువ్వు గమనించలేక పోయావు.

...నేను మరణిస్తే నువ్వు విచారిస్తావ్. కానీ నేను మరణించడంలో నా కెంతో సౌఖ్యం వుంది! నీ విచారాన్ని లెక్కచేయకుండా నాకు కలగబోయే సుఖాన్ని ఊహించుకొని నేను మరణించటం, కేవలం నా ‘స్వార్థమే’ అని నాకు తెలిసినా, నేను మరణించిన తర్వాత ఎవరు సుఖించినా, ఎవరు దుఃఖించినా అది నా కనవసరం. క్షమించు!

—రామారావు.

అది పూర్తిగా చదివిన తర్వాత సుగుణ కళ్ళనుండి రాలబోయే కన్నీరు వెనక్కి తిరిగినయ్!

“స్వార్థపరుడు!” అనుకొంది సుగుణ పళ్లు బిగపట్టి.